## క్లుప్తంగా

### కుష్ఠు నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ చైర్మన్

**చెన్నూర్:** స్థానిక మున్సిపల్ ఆఫీస్‌లో సోమవారం కుష్ఠువ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ అర్చన రామ్ గిల్డా, మున్సిపల్ కమిషనర్ గంగాధర్ హాజరై కుష్ఠువ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రేవెల్లి మహేష్, జగన్నాధుల శ్రీనివాస్, ఆయూబ్‌ఖాన్, డీసీఎంవో శివకుమార్, రాఘవయ్య, ఎంపీహెచ్ ఈవో జగదీష్, ఆశకార్యకర్తలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### క్యాన్సర్ వ్యాధిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీనివాస్

**నెన్నెల:** క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా పాలియేటివ్ కేర్(ఆలన) వైద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. క్యాన్సర్ వారోత్సవాల్లో భాగంగా డయాలసిస్ ఆఫ్ ఆదిలాబాద్ హ్యూమన్ ప్రమోషన్ సొసైటీ కారితాస్ ఇండియా ఆధ్వర్యంలో కొణ్ణపల్లి ఉన్నత పాఠశాలలో సోమవారం ఉజ్వల కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. క్యాన్సర్ సోకితే జిల్లా కేంద్రంలోని ఆలన కేంద్రంలో వైద్య సేవలు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ ఫాదర్ డానియేల్, కో ఆర్డినేటర్ దేవదాస్, వైద్య సహాయకులు వీణ, సభ్యులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### పోస్టర్ ఆవిష్కరణ



**చెన్నూర్:** పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయం ఆవరణలో ఈ నెల 8న లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు. మున్సిపల్ ఆఫీస్ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మున్సిపల్ చైర్మన్ అర్చన రామ్‌లాల్ గిల్డా, మున్సిపల్ కమిషనర్ గంగాధర్, లయన్స్ క్లబ్ సభ్యులతో కలిసి వైద్య శిబిరానికి సంబంధించిన పోస్టర్స్ విడుదల చేశారు.

### సన్మానం

**చెన్నూర్‌రూరల్:** మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సర్వర్ పాషాను సోమవారం అధ్యాపక బృందం ఘనంగా సన్మానించారు. ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిగా ఎంపికయ్యి గత నెలలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో పురస్కారం అందుకున్నందుకు సన్మానం చేసినట్లు ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ తిరుపతి, అధ్యాపకులు ఉన్నారు.

# అధికారులొచ్చినా.. అర్జీలు రాలే!

- ప్రజాదర్బార్‌కు స్పందన కరువు

**దండేపల్లి:** ప్రతి సోమవారం మండల స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు స్పందన అంతంత మాత్రంగానే ఉంది. అధికారులు హాజరవుతున్నా.. అర్జీలు మాత్రం రావడం లేదు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి అధికారులు తప్పా, అర్జీలు ఒక్కటి కూడా రాలేదు. మండల స్థాయిలో ఫిర్యాదు చేసినా, పరిష్కారం కాకపోవడంతోనే ఎవరు రావడం లేదా. అనేది అర్థం కావడం లేదు.

**భీమారం:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ప్రజల నుంచి స్పందన కరువైంది. ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం 12.30వరకు ఎంపీడీవో శ్రీనివాస్‌తో పాటు అధికారులు ప్రజావాణిలో పాల్గొన్నా, ప్రజలు మాత్రం రాలేదు.

**చెన్నూర్‌లో మున్సిపల్ ఆఫీస్‌లో రెండు దరఖాస్తులు..**

**చెన్నూర్:** మున్సిపల్ ఆఫీస్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రెండు దరఖాస్తులు వచ్చాయి. మున్సిపల్ కమిషనర్ గంగాధర్ దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ సాయికిరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కుమార్, వార్డు ఆఫీసర్ సమ్మయ్య పాల్గొన్నారు.



దండేపల్లి: ప్రజావాణికి హాజరైన అధికారులు

**చెన్నూర్‌రూరల్:** స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి స్పందన కరువయ్యింది. ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. ఈ ప్రజావాణిలో ఎంపీడీవో శ్రీనివాస్, ఈజీఎస్ ఏపీవో గంగాభవాని, ఐకేపీ ఏపీఎం ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.



చెన్నూర్: దరఖాస్తు స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్

## భూ కబ్జా దారులపై చర్యలు తీసుకోవాలి

**నస్పూర్:** పట్టణ పరిధిలోని నస్పూర్ శివారు సర్వే నంబరు 42లో ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు నస్పూర్ వాసులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ సంతోష్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వే నంబర్ 42లో దళితులు నిర్మించుకున్న ఇళ్లను అధికారులు కూల్చివేశారని, అదే విధంగా పలువురు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ నాయకులు ప్రభుత్వ భూములను కబ్జా చేసి వాటిలో ఇళ్లు నిర్మించుకుంటే వాటిని ఎందుకు కూల్చివేయడం లేదని ప్రశ్నించారు. సర్వే నంబరు 42లో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని ఇళ్లు లేని నిరుపేదలకు పంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహేష్, దినకర్, రమేశ్, ప్రేమ్, సంజయ్ పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నస్పూర్ వాసులు

## సయ్యద్ షా బాబా చాదర్ శోభాయాత్ర

**చెన్నూర్:** పట్టణంలోని పోస్టాఫీసు ఎదురుగా జమా మసీదు పక్కన గల సయ్యద్ షా బాబా రహెమ్మతుల్లా అలై ఉర్సు ఉత్సవాలలో భాగంగా సోమవారం దర్గా నుంచి ఐబీ చౌరస్తా వరకు గల లైన్‌గడ్డ దర్గా వరకు చందాల్ (చదార్) శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రలో గుర్రాలు చేసిన విన్యాసలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం మసీదు వద్ద గల దర్గా వద్ద కుల మతాలకు అతీతంగా దర్గాను దర్శించుకొని బాబాకు మిఠాయి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి ముంబాయికి చెందిన కళాకారులు హబీబ్ అజ్మేరీ, బేబీ వర్సీలు కవ్వాలీని ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షులు నవాజ్, అఖిల్, ఖంరోద్దీన్‌లు తెలిపారు.



శోభాయాత్ర నిర్వహిస్తున్న ముస్లింలు

## రాజిరెడ్డి అకాల మృతి తీరని లోటు

**బెల్లంపల్లి:** బెల్లంపల్లికి చెందిన ప్రైవేట్ పాఠశాలల సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ సొల్లేటి రాజిరెడ్డి అకాల మృతి తీరని లోటని వక్తలు పేర్కొన్నారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ బాబుక్యాంపు బస్తీలోని రాజా విద్యానికేతన్ పాఠశాలలో సోమవారం దివంగత రాజిరెడ్డి సంతాపసభ నిర్వహించారు. ప్రైవేట్‌పాఠశాలల సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు, శ్రేణులు రాజిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణికుంట్ల ప్రవీణ్, ట్రస్మా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ అజీజ్, చంద్రశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉపేందర్, గౌరవ అధ్యక్షుడు ఎస్.ఎన్ రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ పైడాకుల రాజన్న, కోశాధికారి శ్యాంసుందర్ రెడ్డి, బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు రాజలింగు, జిల్లా నాయకులు అనంతరెడ్డి, తులసి ప్రకాష్, శరత్, థామస్, బాలాజీ, సభియా సుల్తానా, పూర్వ విద్యార్థులు, రాజిరెడ్డి భార్య మధుమతి, కొడుకు సందేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శ్రద్ధాంజలి ఘటిస్తున్న ట్రస్మా నాయకులు

## మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటు చేయాలి

**పాతమంచిర్యాల:** రాష్ట్ర అసెంబ్లీ ప్రాంగణంలో మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటు కోసం మద్దతు, సహకారం ఇవ్వాలని భారత జాగృతి జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి ప్రేంరావు అన్నారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే జి.వినోద్‌ను (మంచిర్యాలలో) ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో భారత జాగృతి విద్యార్థి విభాగం అధ్యక్షుడు తోకల సురేష్, జిల్లా సాహిత్య విభాగం అధ్యక్షుడు దుర్గం రాజేశం, నాయకులు గౌస్, సత్తయ్య, వాసు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న భారత జాగృతి నాయకులు

## సింగరేణి భవిష్యత్ ప్రణాళికపై అవగాహన

**మందమర్రిరూరల్:** సింగరేణి సంస్థ భవిష్యత్ ప్రణాళికపై ఏరియా జీఎం మనోహర్ సింగరేణి ఉద్యోగులకు వివరించారు. మల్టీ డిపార్ట్‌మెంటల్ మీటింగ్‌లో భాగంగా కేకే-5 గనిపై సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏరియాలో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, బొగ్గు తీయడానికి చేస్తున్న ఖర్చు, సాధిస్తున్న బొగ్గు ఉత్పత్తి వివరాలు, ఉద్యోగుల సంక్షేమం కోసం కేటాయిస్తున్న నిధులు తదితర అంశాలపై కూలంకుశంగా వివరించారు. సమావేశంలో అధికారులు, గుర్తింపు కార్మిక సంఘం (ఏఐటీయూసీ) నాయకులు, గని ఉద్యోగులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఏరియా జీఎం మనోహర్

## ఫొటోగ్రాఫర్స్ మేళాకు స్పందన



ద్యాగురే చిత్రపటం వద్ద ఫొటో, వీడియో గ్రాఫర్స్

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** రాష్ట్ర, జిల్లా ప్రొఫెషనల్ ఫొటో, వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఫొటోటెక్ పరివార్ సహకారంతో సోమవారం హాజీపూర్ మండలం వేంపల్లిలోని ఎస్‌వీఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఫొటోగ్రాఫర్స్ మేళాకు విశేష స్పందన లభించింది. ఫొటోటెక్ ఎడిటర్ భూపాల్ ఆధ్వర్యంలో ఫొటోగ్రాఫర్లకు ఫొటోషాప్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ)పై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫొటో, వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపర్తి శ్రీనివాసగౌడ్, మాజీ కోశాధికారి జూరూరి మధు, జిల్లా అధ్యక్షుడు కలర్స్ సతీశ్, ఫొటోటెక్ సీఈఓ అభిమన్యు తదితరులు పాల్గొన్నారు.

## పురోహిత సేవలకు పురస్కారం

**బెల్లంపల్లి:** బెల్లంపల్లి మున్సిపాలిటీ హన్మాన్‌బస్తీకి చెందిన పురోహితుడు భూంపల్లి కార్తీకచార్యులుకు పురస్కారం వరించింది. వరంగల్ జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో సంఘం కార్యాలయంలో ఆదివారం రాత్రి జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. యువచైతన్య వెల్ఫేర్ సొసైటీ, తెలుగు వెలుగు సాహితి వేదిక స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పురోహిత రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న పురోహితులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు కార్తీకచార్యులుకు శాలువా కప్పి సన్మానం చేసి అవార్డును అందజేశారు.

**జన్నారంవాసికి సేవారత్న అవార్డు**

**జన్నారం:** మండలంలోని కలమడుగు గ్రామానికి చెందిన కైరం కిషన్ గౌడ్, పొనకల్‌కు చెందిన కంప సుధీర్‌కుమార్‌ను సేవా రత్న అవార్డు వరించింది. ఈ సందర్భంగా అవార్డు తీసుకోవడం తమకు ఎంతో ఆనందంగా ఉందని, మరిన్ని సేవా కార్యక్రమాలతో ముందుకు వెళ్తామని పేర్కొన్నారు.



కార్తీక చార్యులకు అవార్డు అందిస్తున్న నిర్వాహకులు

## యాదవులు ఐక్యంగా ముందుకు సాగాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

**నస్పూర్:** యాదవ కులస్తులు ఐక్యంగా ముందుకు సాగాలని భారత యాదవ సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసరి నరేశ్ యాదవ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ది రమేశ్ అన్నారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్ ఆవరణలో సోమవారం యాదవ కులస్తుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత యాదవ సమితి క్యాలెండర్‌ను వారు ఆవిష్కరించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. భారత యాదవ సమితి బలోపేతానికి ప్రతీ యాదవ కులస్తుడు తన వంతు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సెక్రటరీ బుక్క రాజు, తిరుపతి యాదవ్, జిల్లా అధ్యక్షుడు గొర్రె తిరుపతి యాదవ్, గౌరవ అధ్యక్షుడు గంగన్న యాదవ్, నాయకులు సతీష్ యాదవ్, చిలుకల మల్లేశ్ యాదవ్, రవికిరణ్ యాదవ్, గెల్లు రవీందర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## యోగాలో చాంపియన్ రమేశ్‌కుమార్

**మందమర్రిరూరల్:** మందమర్రి పట్టణానికి చెందిన కొంపెల్లి రమేశ్ యోగాలో చాంపియన్ సాధించారు. బెల్లంపల్లిలోని ఆర్యవైశ్య భవన్‌లో కాకా వెంకటస్వామి స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ లెవల్ 50-60వయస్సు గ్రూపు వారి యోగా పోటీల్లో రమేశ్ పాల్గొని యోగా విన్యాసాలు ప్రదర్శించారు. ఈ పోటీల్లో రమేశ్‌కుమార్ గెలుపొందగా ట్రస్ట్ సభ్యులు చాంపియన్ ట్రోఫీ బహూకరించారు. ఈ సందర్భంగా రమేశ్‌కుమార్‌ను యోగా మాస్టర్ ముల్కల్ల శంకర్ తదితరులు సోమవారం అభినందించారు.



రమేశ్‌కుమార్‌ను అభినందిస్తున్న యోగా మాస్టర్

## అనారోగ్యంతో బాలుడు మృతి

- పోలీసులకు తండ్రి ఫిర్యాదు

**నస్పూర్:** అనారోగ్యంతో బాలుడు మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం పట్టణ పరిధిలోని హౌజింగ్ బోర్డుకు చెందిన కాంపల్లి కిరణ్‌కుమార్‌కు హాజీపూర్ మండలం కర్ణమామిడికి చెందిన అఖిలతో 14 ఫిబ్రవరి 2020న వివాహమైంది. వారికి ఒక బాబు జన్మించాడు. దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండడంతో ఎనిమిది నెలల క్రితం అఖిల కుమారుడు యదద్యు భవేష్ (4)ను తీసుకుని పుట్టింటికి వెళ్లింది. జనవరి 9న బాబు ఆరోగ్యం బాగా లేదని భర్త ఇంటికి వచ్చింది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 4న మళ్లీ ఆస్పత్రికి వెళ్లాల్సి ఉండగా అఖిల తల్లి రాజేశ్వరి ఈ నెల 3న ఇంటికి వచ్చి తమ కూతుర్ని పుట్టింటికి పంపించమని అడిగింది. బాబు ఆరోగ్యం బాగాలేదని చెప్పి ఆమెను తిరిగి పంపించాడు. దీంతో రాజేశ్వరి హాజీపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు దంపతులిద్దరికి కౌన్సిలింగ్ ఇచ్చి భార్య, కుమారుడిని అత్తారింటికి పంపించారు. ఆదివారం రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో భార్య తరుపు బంధువులు ఫోన్ చేసి నీ కుమారుడు చనిపోయాడని చెప్పారు. మా మామ ఆర్ఎంపీనంటూ నాకుమారుడికి తెలిసీ తెలియని మందులు ఇచ్చి జబ్బు ముదిరేలా చేశాడని, మృతికి భార్య, అత్తామామలు, బావమరిది కారణమంటూ కిరణ్‌కుమార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.



భవేష్(ఫైల్)

### ఆలయాల్లో దొంగతనాలు

**మంచిర్యాలక్రైం:** జిల్లా కేంద్రంలోని పోచమ్మ గుడిలో, గోపాలవాడ, ఏసీసీ సమీపంలోని గొల్లవాడ హన్మాన్ టెంపుళ్లలో దొంగతనం జరిగినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గోపాలవాడలోని హన్మాన్‌టెంపుల్‌లో జరిగిన దొంగతనంలో రూ.8వేలు, ఏసీసీ సమీపంలోని గొల్లవాడ హన్మాన్ టెంపుల్‌లో రూ.12వందలు చోరీకి గురైనట్లు తెలిపారు. గాంధీనగర్‌లో పోచమ్మ గుడిలో ప్రవేశించినప్పటికీ ఎలాంటి వస్తువులు చోరీకి గురికాలేదని తెలిపారు. దేవుని గుడులను టార్గెట్ చేసి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. టెంపుల్స్ శివారు ప్రాంతాల్లో ఉన్నందునా, రెండు ప్రత్యేకంగా పెట్రోలింగ్ బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## ఊర చెరువును పరిశీలించిన ఇరిగేషన్ ఏఈ

సాక్షి ఎఫెక్ట్..

**మందమర్రిరూరల్:** సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'అక్రమంగా మట్టి తరలింపు' కథనానికి ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించారు. ఇరిగేషన్ ఏఈ రమ్య అందుగులపేటలోని ఊరచెరువు వద్దకు వెళ్లి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మట్టి తరలించే విషయాన్ని ఇదివరకే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. చెరువు నుంచి మట్టి తరలించినట్లు ఆనవాళ్లు ఉన్నాయని, నంబర్ ప్లేట్లు లేని ట్రాక్టర్ల ద్వారా మట్టి తరలించారని, సీసీ కెమెరా పుటేజీల ఆధారంగా తెలుసుకుంటామన్నారు. అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఊరచెరువును పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఏఈ రమ్య

# కార్యకర్తలే కాంగ్రెస్‌కు కొండంత బలం

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్

**బెల్లంపల్లి:** కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే కొండంత బలమని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి 3వ వార్డు రవీందర్ నగర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని, ప్రతి ఒక్కరూ పార్టీకి విధేయులై కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ అధికార ప్రతినిధి బత్తుల రవి పూలమాల వేసి, శాలువా కప్పి ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ కారుకూరి రాంచందర్, కాంగ్రెస్ శ్రేణులు సురేష్, హరీశ్, ప్రదీప్, గ్రామ ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

**'రవాణా వ్యవస్థను మెరుగుపరుస్తా'**

**వేమనపల్లి:** మండలంలో అనాధిగా పరిష్కారానికి నోచుకోకుండా ఉన్న రవాణా కష్టాలను త్వరలో మెరుగుపరుస్తానని ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి అన్నారు. వేమనపల్లి మండలంలోని మారుమూల చామనపల్లి గ్రామపంచాయతీలో చామనపల్లి పెద్దవాగుపై వంతెన నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి రవాణా కష్టాలతో బాధపడుతున్న చామనపల్లి ప్రజలకు రవాణా కష్టాలు తీరుతాయన్నారు. గ్రామపంచాయతీ పరిధిలోని తాగు నీటి సమస్యను కూడా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఇప్పటికే రెండు గ్యారంటీలను పరిష్కరించిందని, మరో రెండు హామీలు 200యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500గ్యాస్ సిలిండర్లు అందించేందుకు సిద్ధమవుతుందన్నారు. ప్రతి మారుమూల గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం చామనపల్లి గ్రామపంచాయతీ కేంద్రంలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్.స్వర్ణలత, ఎంపీటీసీ సంతోష్‌కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాబీర్‌ఆలీ, వైస్ ఎంపీపీ గణపతి, మాజీ సర్పంచ్ గాలి మధు, ఎంపీడీఓ లక్ష్మయ్య, ఎంపీఓ బాపురావు, పీఆర్ ఏఈ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



నెన్నెల మాజీ సర్పంచ్ దంపతులను సన్మానిస్తూ..

**'నిధులు తెచ్చే బాధ్యత నాది.. పనులు చేసే బాధ్యత మీది'**

**నెన్నెల:** గ్రామాల అభివృద్ధి కోసం నిధులు తెచ్చే బాధ్యత నాదని, పనులు చేసే బాధ్యత కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులదని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. నెన్నెల మండల కేంద్రంలో పంచాయతీ పాలకవర్గం సభ్యుల పదవీ కాలం పూర్తయిన సందర్భంగా సోమవారం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నెన్నెల, కుశ్నపల్లి మాజీ సర్పంచులు తోట సుజాత, శ్రీనివాస్, సంధ్యా-మహేశ్ దంపతులను శాలువాలతో సన్మానించారు. నన్ను గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయనన్నారు. నెన్నెల మండలాన్ని విడతల వారీగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానన్నారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించి నా దృష్టికి తీసుకొచ్చే బాధ్యత నాదన్నారు. తన గెలుపునకు కృషి చేసిన ఎవరినీ మర్చిపోనని చెప్పారు. అభివృద్ధి ఎజెండాగా పని చేయడానికి వచ్చానన్నారు. కార్యక్రమంలో గొల్లపల్లి ఎంపీటీసీ హరీష్‌గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గట్టు మల్లేష్, నాయకులు కిషన్‌రెడ్డి, బానేష్, మొహిద్‌ఖాన్, శంకరయ్య, సాంబమూర్తి పాల్గొన్నారు.

### నియామకం

**మంచిర్యాలక్రైం:** యువజన కాంగ్రెస్ చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా అరిగెల తిరుమలరావ్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రవ్యాప్తంగా యువజన విభాగంలో నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జిలను నియమించినట్లు తెలిపారు.

### కోదండరెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

**జన్నారం:** కాంగ్రెస్ పార్టీ జాతీయ కిసాన్ సెల్ అధ్యక్షుడు కోదండ రెడ్డిని సోమవారం జన్నారం మండలానికి చెందిన రిటైర్డ్ పరిశ్రమల శాఖ అధికారి, జన్నారం మండల వాసి జాదవ్ రాంకిషన్ నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. మండల సమస్యలను చర్చించడంతో పాటుగా, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని సూచించినట్లు రాంకిషన్ నాయక్ తెలిపారు. ఆయన వెంట నాయకులు పాత బాలరాజు, మహ్మద్ కౌసర్, మడావి లక్ష్మీకాంత్, చంద్రయ్య ఉన్నారు.

### అన్నదానం

**పాతమంచిర్యాల:** లయన్స్ క్లబ్ స్వర్ణోత్సవాల సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన లయన్స్ ఫ్రీ మీల్స్ ఆన్‌వీల్స్ కార్యక్రమం ద్వారా పేద ప్రజల ఆకలి తీరుతుందని లయన్స్ ఫ్రీ మీల్స్ ఆన్ వీల్స్‌ప్రోగ్రాం చైర్‌పర్సన్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా గత సంవత్సరం అక్టోబర్ నెలలో ప్రవేశపెట్టిన 'లయన్స్ ఫ్రీ మీల్స్ ఆన్ వీల్స్' ఉచిత నిత్య అన్నదాన కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతూ, 100వ రోజుకు చేరిన సందర్భంగా జిల్లా కేంద్రంలోని మాతాశిశు ఆస్పత్రిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్టు గవర్నర్ వెంకటేశ్వర్‌రావు, సభ్యులు పాల్గొన్నారు.

